ఈ రోజు (21.12.2022) జరిగిన సిపిఐ(యం) పత్రికా విలేఖరుల సమావేశం నోట్‌ను ప్రచురణార్థం పంపుతున్నాము
– జె.జయరాం

---

**లేబర్‌కోడ్ల అమలు పేరుతో**
**కార్మికులు, ఉద్యోగులపై కక్షసాధింపు, వేధింపులు**
**సిపిఎం రాష్ట్ర కమిటీ**
**కోడ్ల అమలులో బిజెపి పాలిత రాష్ట్రాల కంటే ముందున్న ఎపి**
**బైజూస్‌తో ఒప్పందాన్ని రద్దు చేయాలి**
**పట్టణ ప్రాంతాల్లో శవాలతో వ్యాపారం**
**ప్రజల సొమ్ముతో కట్టిన టిడ్కో ఇళ్లు ధ్వంసం**
**అప్పులు చేస్తున్నా ఉపాధి లేదు**

లేబర్ కోడ్ల పేరుతో కార్మికుల హక్కులను కాలరాస్తున్న బిజెపి ప్రభుత్వానికి వైసిపి ప్రభుత్వం వంతపాడుతోందని, నిరసనలు, ఆందోళనలు కనిపించకూడదనే విధంగా వ్యవహరిస్తోందని దీనికి వ్యతిరేకంగా రాబోయే అసెంబ్లీ సమావేశాల సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు, ఉద్యోగులు పెద్దఎత్తున ఆందోళనకు సిద్ధమవుతున్నారని, దీనికి సిపిఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందని రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ ప్రకటించారు.

బుధవారం విజయవాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు అధ్యక్షతన విజయవాడలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశాల్లో రాష్ట్రంలో తక్షణం కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలతోపాటు ఇటీవల జరుగుతున్న పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశాలకు పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం.ఎ.బేబీ, బి.వి.రాఘవులు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా తీసుకున్న నిర్ణయాలను వారు వెల్లడించారు. బిజెపి నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా రూపొందించిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను అమలు చేయడంలో వైసిపి ప్రభుత్వం బిజెపి పాలిత రాష్ట్రాల కంటే వేగంగా ముందుకు వెళుతోందని తెలిపారు. దీనిపై ప్రశ్నించడాన్ని తట్టుకోలేకపోతోందని వివరించారు. ఉద్యోగుల, కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించకుండా ఆందోళన చేస్తున్నవారిపై పోలీసు కేసులు పెట్టడం, అక్రమంగా నిర్బంధించడం, వారి ప్రదర్శనలను అనుమతించకపోవడం చివరికి ధర్నాలు, నిరాహారదీక్షలూ ప్రభుత్వం దృష్టిలో నేరమైపోయాయని వివరించారు. శాంతియుతంగా పౌరులు తమ నిరసనలను తెలిపే హక్కును రాజ్యాంగం గ్యారెంటీ చేసినా రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధాన్ని విధించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇటీవల బహిరంగ సభలే కాకుండా ఇన్‌డోర్ సమావేశాలను కూడా పోలీసులు అడ్డుకుంటున్నారని అన్నారు. ఒక హాల్‌లో సమావేశమై తమ సమస్యల గురించి చర్చించుకోవడం ఏ విధంగా చట్టవిరుద్ధమవుతుందో ప్రభుత్వం చెప్పాలని ప్రశ్నించారు. కార్మికుల, ఉద్యోగుల సమస్యలపై తక్షణం స్పందించాలని, నిర్బంధాన్ని మానుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలు, ప్రజాతంత్రవాదులు ఈ నిర్బంధాన్ని ఖండించాలని విజ్ఞప్తి చేశారు. కనీసం నిరసనలు, అభిప్రాయాలు చెప్పడానికి వీల్లేదని, నోటికి తాళాలు వేసుకుని ఉండాలనే విధంగా ఆదేశాలు జారీచేస్తోందని వివరించారు.

ఇప్పటి వరకు అమల్లో ఉన్న 29 కార్మిక చట్టాలను రద్దు చేయడం తీవ్రమైనటువంటి కార్మిక వ్యతిరేక చర్యని అన్నారు. గత చట్టాల్లో కార్మిక సంక్షేమానికి ఉపయోగపడే అనేక అంశాలను బిజెపి కేంద్ర ప్రభుత్వం తొలగించిందని పేర్కొన్నారు. పారిశ్రామిక యాజమాన్యానికి తోడ్పడేందుకు కార్మికుల మౌలిక హక్కులను కుదించే పద్ధతిలో ఈ కోడ్‌లు రూపొందించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పని భారాన్ని మరింత పెంచేందుకు ఉద్యోగ భద్రత లేకుండా చేసేందుకు సంక్షేమ పథకాలు వర్తించకుండా చేసేందుకు యజమానులకు అన్ని అవకాశాలను ఈ లేబర్ కోడ్‌లు కల్పించాయని వివరించారు. కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలు తప్ప కార్మిక ప్రయోజనాలు ఈ లేబర్ కోడ్‌లో ఎక్కడా లేవని, రాష్ట్ర ప్రభుత్వం వీటిని అమలు చేయాలనుకోవడం కార్మికుల వ్యతిరేక చర్యని వివరించారు. ఈ కోడ్‌లకు అనుగుణంగా రూల్సు రూపొందించకూడదని డిమాండు చేశారు. రాష్ట్రంలో కార్మిక సంక్షేమాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని వివరించారు. 50 లక్షల మందికి పైగా పనిచేస్తున్న షెడ్యూల్డు పరిశ్రమల్లో కార్మికుల వేతనాలను 20

సంవత్సరాలుగా సవరించడం లేదని, ఐదు సంవత్సరాలకొకసారి ధరల పెరుగుదలను బట్టి సవరించడం ప్రభుత్వ చట్టబద్ద బాధ్యతని అన్నారు. దీనివల్ల ప్రభుత్వానికి రూపాయి భారం ఉండదని, అయినా చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అంగన్‌వాడీలు, ఆశాలు, ఆరోగ్య కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులు తదితర ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న లక్షలాది మహిళలు తమ వేతనాలని సవరించాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని, తెలంగాణా కంటే వెయ్యి రూపాయలు ఎక్కువగా ఇస్తామని హామీనిచ్చారని, దీని ప్రకారం రూ. 14,500 ఇవ్వాలని అన్నారు. రాష్ట్రంలో రూ. 11,500 మాత్రమే ఇస్తున్నారని పేర్కొన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ రంగంలో మూడు లక్షలకు పైగా ఉద్యోగ కార్మికులు సమాన పనికి సమాన వేతనాన్ని కోరుతున్నా ప్రభుత్వంలో స్పందన లేదన్నారు. సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించమని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేయాలని ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం వీటిన్నింటినీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

### బైజూస్‌పై తక్షణం విచారణ జరిపించాలి

ఎనిమిదో తరగతి నుండి విద్యార్థులకు పంపిణీ చేస్తున్న ట్యాబుల్లో బైజూస్ కంటెంట్ పెట్టి ఇస్తున్నారని, దివాళా తీసిన సంస్థకు సిఎం మార్కెటింగ్ మేనేజర్‌లాగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బైజూస్ నాణ్యతకు ఎలాంటి సాధికారత లేదని, నిపుణులు నిర్ధారించలేదని అధి నాణ్యమైన విద్యనిస్తుందని ఎక్కడా రుజువు కాలేదని దానితో ఒప్పందం ఎలా చేసుకున్నారని ప్రశ్నించారు. కంటెంట్ విషయంలో ఎవరి అభిప్రాయాలూ తీసుకోలేదని, నిపుణులతో సంప్రదించలేదని, ఎవరితో సంప్రదించారో ఆ విషయాన్నైనా బయటపెట్టాలని కోరారు. ఎవరితోనూ సంప్రదించకుండా ప్రభుత్వంలో ఉండేవారే దాన్ని నిర్ణయిస్తే అది వ్యాపార సంబంధ లావాదేవీ తప్ప విద్యా పరమైన సంబంధం కాదని అన్నారు. ప్రభుత్వ విద్యపై బైజూస్ పెత్తనాన్ని అంగీకరించరాదన్నారు. వందల కోట్ల రూపాయల అమ్మ ఒడి నిధులను బైజూస్‌కు కట్టబెట్టడం సరికాదని, తక్షణం దీన్ని రద్దు చేయాలని కోరారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

### పోలవరం బాధితులను ముంచేశారు

ప్రత్యేక హెూదా ఇవ్వబోమని కేంద్రం చెబుతున్నా రాష్ట్రం కనీసం నోరెత్తడం లేదని, పోలవరం నిర్వాసితులకు ఇంతవరకు న్యాయం జరగలేదని అన్నారు. రంపచోడవరం నియోజకవర్గం పరిధిలో వరద బాధితులకు ఇంతవరకు ఎలాంటి పరిహారం ఇవ్వకుండా వారందరినీ గోదావరి ముంపు నీటిలో ముంచేశారని అన్నారు. పునరావాసానికి తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### టిడ్కో ఇళ్లు ధ్వంసం

వేలకోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన టిడ్కో ఇళ్లు ధ్వంసం అవుతున్నాయని, వాటిని అర్హులకు పంచడం లేదని అన్నారు. ఈ ఇళ్లకు లబ్దిదారులే బ్యాంకులకు ఇప్పటికీ రుణాలు కడుతున్నారని అన్నారు. అయినా ప్రభుత్వం వాటిని పంచకపోవడంతో పాడైపోతున్నాయని, పిచ్చి మొక్కలు మొలిచి, పునాదులు దెబ్బతిన్నాయని తెలిపారు. తలుపులు చెదలు పట్టిపోతున్నాయని, నివాసయోగ్యానికి వీలుకాకుండా ఉన్నాయని వివరించారు. ఇటీవల తాము పర్యటించిన అనేక ప్రాంతాల్లో టిడ్కో ఇళ్లు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయని పేర్కొన్నారు.

### పట్టణాల్లో శవాలపై వ్యాపారం

పట్టణ ప్రాంతాల్లో మృత దేహాలను దహనం చేసేందుకు జిఎస్‌టితో కలిపి డబ్బు వసూలు చేస్తూ శవాలపై వ్యాపారం చేస్తున్నారని అన్నారు. రాయలసీమ జిల్లాల్లో అన్నమయ్య ప్రాజెక్టు దెబ్బతింటే ఇంతవరకు గేట్లు పెట్టలేదని, పైగా ప్రాజెక్టుల్లో గట్ల మట్టిని అక్రమార్కులు దోచుకుంటున్నా పట్టించుకోవడం లేదని అన్నారు. ముఖ్యమంత్రే వారికి లైసెన్స్ ఇచ్చినట్లు అక్కడ దోపిడీ జరుగుతోందని దీనిపైనా విచారణ జరిపించాలని కోరారు. ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నా రైతులకు డబ్బులు చెల్లించకుండా బకాయిలు పెడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో లక్షలకోట్లు అప్పులు చేస్తున్నా ఎక్కడా ఉపాధి కల్పించే పరిశ్రమలు రాలేదని, ఉపాధి కల్పించలేని అప్పులు పాలకులు చేస్తున్నారని మండిపడ్డారు.